క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

105 మందికి హోమియో మందులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 105 మంది రోగులను వైద్యులు టి.జగన్నాథరావు, టీజే మోహన్ పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు కేఎస్ఎన్ మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.లక్ష్మణరావు, వి.శ్రీనివాసరావు, వి.రాంబాబు, ఎం.శంకర్, గంధ రాము, సాయి పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

భీమునిపట్నం: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. తెడ్డు రాందాసు ఆధ్వర్యంలో నిమ్మకాయల పైడిరాజు, చొక్క నర్సింగరావు, పాసి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సేవా కార్యక్రమాలు చేస్తాం

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి సేవా సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తానని ఆ సంఘం అధ్యక్షుడు డి.గోపాలకృష్ణ మూర్తి రాజు తెలిపారు. పద్మనాభంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో 2024 మార్చి నెలలో జరగనున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలకు చాగంటి కోటేశ్వర రావును ఇటీవల కాకినాడ వెళ్లి ఆహ్వానించగా తప్పకుండా వస్తామన్నారని చెప్పారు.

360 టన్నుల మట్టికి నేడు వేలం

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో పెద్ద చెరువు వద్ద అనధికారికంగా ఉన్న 360 టన్నుల మట్టిని సీజ్ చేయగా ఈ నెల 22న వేలం వేయనున్నట్టు తహసీల్దార్ టి.శ్రీవల్లి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న మట్టిని సీజ్ చేసినట్టు ఆమె పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కొమ్మాది: విద్యార్థి దశ నుంచి పిల్లలు క్రీడల్లో కూడా రాణించాలని వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఎస్సీ సెల్ ఇన్‌చార్జి సియాద్రి కనకరాజు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలో పీఎన్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ నర్సింగరావు నేతృత్వంలో సంవత్సరం పాటు కరాటేలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ఆయన అందజేశారు. విద్యార్థులు బాల్యం నుంచే కృషి, పట్టుదల అలవరచుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, స్థానిక నాయకులు గుంటుబోయిన సంజీవ్ యాదవ్, గుంటుబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి విడిది.. మన శిల్పారామం



వాటర్ పార్కులో జలకాలాట

- నగరవాసులను ఆకట్టుకునేలా సౌకర్యాలు
- ప్రత్యేక ఆకర్షణగా వాటర్ పార్క్
- ఓపెన్ జిమ్, ఆధునిక ఆట పరికరాల ఏర్పాటు



శిల్పారామం(జాతర) ముఖద్వారం

పీఎం పాలెం: మధురవాడలోని విశాలమైన ప్రాంతంలో సందర్శకుల కోసం ఎన్నో ప్రత్యేకతలతో ఉన్న శిల్పారామం(జాతర)ను మరింతగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. కొన్నాళ్ల కిందటి వరకూ స్తబ్దుగా ఉన్న నగరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సరికొత్త అందాలు సంతరించుకుంటోంది. ఈ నాలుగున్నరేళ్లలో శిల్పారామంలో ఆకర్షణీయ నిర్మాణాలు, చిన్నాపెద్దల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. ఉదయం పెద్దల వ్యాయామం, చిన్నారుల ఆటపాటలు, సాయంత్రం సేదతీరడానికి శిల్పారామం అందుబాటులో ఉందని స్థానికులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఈ మండువేసవిలో చక్కని విడిదిగా శిల్పారామానికి ప్రజలు భారీగా తరలివస్తున్నారు.

నిధుల విడుదలతో అభివృద్ధి పనులు..

సుమారు 27 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనంతో అలరారే శిల్పారామం నిత్యం సందర్శకులను అలరిస్తోంది. ప్రతి ఆదివారం వినోదం, సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక సమస్యలపై రాష్ట్ర పర్యాటక శాఖకు శిల్పారామం నిర్వాహకులు నివేదిక సమర్పించడంతో ఆ శాఖ మంత్రి ఆర్‌కే రోజా స్పందించి నిధులు మంజూరు చేశారు. వెంటనే పనులు చేపట్టి శిల్పారామంలోని ప్రధాన ఆకర్షణగా ఉన్న చిత్రాలకు పెయింటింగ్ వేశారు. సజీవ శిల్పాలను ఆకర్షణీయంగా మలిచారు. అడుగడుగునా సజీవ శిల్పాలు, జెయింట్ వీల్, చిన్నపిల్లల కోసం ట్రైన్, ఆధునిక రంగుల రాట్నం, ఓపెన్ జిమ్, పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా వాటర్ పార్కులు ఇలా ఎన్నో ప్రత్యేక ఆకర్షణగా ఉండటంతో నగర వాసులు కుటుంబంతో సహా శిల్పారామానికి చేరుకుని ఎంజాయ్ చేస్తున్నారు.



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

ప్రవేశ రుసుం.. సందర్శన వేళలు

నిర్ణీత ప్రవేశ రుసుం చెల్లించి ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకూ శిల్పారామంలో గడపవచ్చు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సీనియర్ సిటిజన్లు నెలకు చెల్లించాల్సిన రుసుం కేవలం రూ.50 మాత్రమే. పదేళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయసు వారు నెలకు రూ. 200 చెల్లించాలి. విద్యార్థులు రూ.100 చెల్లిస్తే చాలు. చేతివృత్తుల పనివారు, దివ్యాంగులు, జిల్లా స్థాయి ఉత్తమ క్రీడాకారులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు.

ప్రతి ఉదయం పండగే

ఉదయం పూట వాకింగ్‌కు వచ్చే వారికి శిల్పారామం ఎంతో అనుకూలమైనంది. ప్రశాంతమైన వాతావరణం, కాలుష్యరహితంగా పక్షుల కిలకిలరావాలతో ఎంతో హాయిని పొందవచ్చు. సీనియర్ సిటిజన్లకు ప్రతి ఉదయం పండగలా ఉంటుంది.

– బొడ్డేపల్లి చిరంజీవి, పీఎం పాలెం

వ్యాయామానికి అనుకూల ప్రదేశం

ఉదయం శారీరక వ్యాయామం చేసుకునే వారికి శిల్పారామం ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ ఓపెన్ జిమ్, 2 షటిల్ కోర్టులు కూడా ఉన్నాయి. చిన్నాపెద్దా అంతా కలిసి సరదాగా గడపవచ్చు.

– సూర్య, మధురవాడ

మరింత అభివృద్ధికి చర్యలు

విశాఖలో ముఖ్యమైన సందర్శన ప్రదేశంగా శిల్పారామంను తీర్చిదిద్దుతాం. ప్రజలు శుభకార్యాలు జరుపుకోడానికి అందుబాటు ధరలో, అన్ని సదుపాయాలతో కూడిన కల్యాణ మండపం ఉంది. ఇక్కడ స్టార్ హోటల్ నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది.

– టి.విశ్వనాథరెడ్డి, పరిపాలనాధికారి, శిల్పారామం

కుట్టుమిషన్ల అందజేత



కుట్టు మిషన్లు అందజేస్తున్న రోటరీ వైజాగ్ మెట్రో సభ్యులు

కొమ్మాది: రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో నిర్వహిస్తున్న రోటరీ వైజాగ్ మెట్రో మహిళ సాధికారత కేంద్రంలో కుట్టు పని నేర్చుకుని అర్హులైన 11 మంది మహిళలకు ఆదివారం కుట్టు మిషన్లు అందజేశారు.

ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో అధ్యక్షురాలు కె.సునీత లావణ్య మాట్లాడుతూ కుట్టుపనిపై ఆసక్తి గల మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చి వారికి జీవనోపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లొడగల రామ్మోహన్, మెట్రో వ్యవస్థాపక అధ్యక్షులు మొదిలి మహేష్, కార్యదర్శి ఎస్.గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు నేడు సత్కారం

ఆనందపురం : సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు మండలంలోని బోని గ్రామంలో సోమవారం సత్కారం ఏర్పాటు చేసినట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై ప్రతిభ కనబరిచిన వారిని సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించడంతోపాటు నగదు ప్రోత్సాహకాలు ప్రభుత్వం తరపున అందజేస్తారని తెలిపారు. ఇక్కడ నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని కూడా ప్రారంభిస్తారని తెలిపారు.

మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



కుళాయిలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్ నగర్‌లో 2013 నుంచి స్థానికులను వేధిస్తున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఏళ్ల తరబడి వేధిస్తున్న ఈ సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి స్థానిక కార్పొరేటర్ లొడగల అప్పారావు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ ప్రాంతానికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయించారు.

వాటిని కార్పొరేటర్ అప్పారావు ఆదివారం ప్రారంభించడంతో స్థానిక మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మంచి నీరు సుమారు 500 కుటుంబాల దాహం తీర్చుతుందన్నారు. కార్యక్రమంలో ఉప్పులూరి గోపి, మాదు చంటి, లొడగల రామ్మోహన్, రాంబాబు, అప్పలస్వామి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరమెట్టపై ప్రత్యేక పూజలు





వేంకటేశ్వర మెట్టపై హోమంలో భక్తులు, అలంకరణలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి

తగరపువలస: స్థానిక వేంకటేశ్వరమెట్టపై గల అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రేజేటి శ్రీరామాచార్యులు, సీతారామాచార్యులు వేదపారాయణ, పంచగవ్యప్రాశన, నిత్య హోమాలు, నీరాజన మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో విశ్వక్సేనుడు, గరుడాళ్వార్, వకుళమాత, వరదరాజుస్వామి, యోగ నరసింహస్వామి, బేడీ ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రతిష్ఠించనున్నారు. అనంతరం అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి కల్యాణం, అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కుసుమహర ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం(జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన శ్రీ నటరాజ నాట్య మండలిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమదైనరీతిలో కూచిపూడి, జానపద నృత్యాలు అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వినాయక స్తుతికి ప్రదర్శించిన కూచిపూడి నృత్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. కళాకారులు వాసుదేవ్, స్వాతి, స్వప్న, ఖాస్మిత, శ్రీలక్ష్మి, ఈక్షిత, సుదాక్ష, స్నేహ, హాసిని, అక్షయ, స్వాతి తదితర కళాకారులు పాల్గొనగా ఈ.బిందుకామేశ్వరి నృత్య దర్శకత్వం వహించారు.

నేరెళ్లవలస కొండపై ఆగని తవ్వకాలు

తగరపువలస: భీమిలి మండలం నేరెళ్లవలస కొండపై గ్రావెల్ తవ్వకాలు నిరాటంకంగా జరుగుతున్నాయి. శని, ఆదివారాల్లో రాత్రి వేళ చీకటిమాటున యంత్రాలు వినియోగించి లారీలతో గ్రావెల్ తరలించుకుపోతున్నారని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండ తవ్వకం, గ్రావెల్ తరలింపు వెనుక రెవెన్యూ అధికారుల హస్తం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో సోమవారం కలెక్టరేట్‌లోని స్పందనలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

అర్ధరాత్రి చకచకా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



ఆనందపురం 132 కేవీ సబ్ స్టేషన్‌లో అర్ధరాత్రి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

మధురవాడ: మధురవాడ సబ్ స్టేషన్, కొమ్మాది సబ్ స్టేషన్ పరిసరాల్లో శనివారం అర్ధరాతి చకచకా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. రాత్రి 11 నుంచి 12 గంటల మధ్య విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విపరీతమైన ఎండలు, సాధారణం కంటే ఎక్కువ మొత్తంలో విద్యుత్ వినియోగంతో భీమిలి క్రాస్ రోడ్డు సమీపంలోని ఆనందపురం 132 కేవీ ఈహెచ్‌టీ సబ్ స్టేషన్‌లో మధురవాడ పరిసర ప్రాంతాలకు విద్యుత్ తీసుకొచ్చే జంపర్ రెండు చోట్ల తెగిపోవడంతో సరఫరా నిలిపోయింది. దీంతో మధురవాడ, కొమ్మాది సబ్ స్టేషన్ల పరిధిలోని మధురవాడ, స్వతంత్రనగర్, మారికవలస, కొమ్మాది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధురవాడ, కొమ్మాది సబ్ స్టేషన్ల సిబ్బంది వెంటనే అప్రమత్తమై గంట వ్యవధిలో మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారని మధురవాడ ఏఈఈ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు.

వుడా హరిత సబ్ స్టేషన్‌లో 11కేవీ మధురవాడ హిల్ నంబర్ - 1 ఫీడర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మానం ఆంజనేయులునగర్, ఆర్‌టీసీ కాలనీ, కొత్తపాలెం, అయోధ్యనగర్, మల్లయ్యపాలెం, గణేష్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం వేకువజామున 3 గంటల నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో మధురవాడ సబ్ స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా సరఫరా చేశారు. ఆదివారం సంస్థ ఎమ్‌టీఆర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

మండుటెండలో సేవా కార్యక్రమాలు



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న సేవకులు

మధురవాడ: ఒక వైపు ఎండ మండిపోతుంటే మరోవైపు సేవకులు అదే స్థాయిలో ఆదివారం మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ ఆలయం ఆవరణలో పీఎంపాలెంకి చెందిన వానపల్లి బాల నాగేశ్వరరావు, అన్నపూర్ణ సహకారంతో పాదచారులు, భక్తులు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి బడిగింటి నీలకంఠం, కేవీ నాగేశ్వరరావు, పిళ్లా సూరిబాబు ప్రారంభించారు.

- మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని 100 అడుగుల రోడ్డులో ప్రమీల రాజీవ్ సహకారంతో మజ్జిగ అందించారు. భజన మండలి కన్వీనర్ ఎమ్.మురళీకృష్ణ తదితరులు చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి, నిరాశ్రయులకు వుడా కాలనీలో రోడ్డులో భోజనం ప్యాకెట్లు పంచిపెట్టారు.

ముగిసిన సద్గురు సేవాశ్రమ వార్షికోత్సవాలు



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తగరపువలస: జీవీఎంసీ 4వ వార్డు రామయోగి అగ్రహారానికి చెందిన సద్గురు సేవాశ్రమం 13వ వార్షికోత్సవాలు ఆదివారం అన్నదానంతో ముగిశాయి. ఈ నెల 15న ప్రారంభమైన వేడుకల సందర్భంగా వారం రోజులపాటు ఆశ్రమంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చివరి రోజైన ఆదివారం ఆశ్రమం ఆవరణలో వ్యవస్థాపక ధర్మకర్త యోగా రాజు ఆధ్వర్యంలో 3 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేసి, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు ప్రారంభించారు. నగరానికి చెందిన శృతిలయ సంస్థ భక్తి గాన సుధ కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక, భక్తి, లలిత, సినీ గీతాలు ఆలపించి భక్తులను ఓలలాడించారు. మత్స్యకార నాయకుడు కదిరి జగన్నాథం, వుయ్ కేర్ యూ సొసైటీ ప్రతినిధులు, నగరంతోపాటు మన్యానికి చెందిన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సహాయ సహకారాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో పెయింటర్ మృతి



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

తగరపువలస: స్థానిక జాతీయ రహదారిపై సంగివలస వద్ద శనివారం మధ్యాహ్నం రోడ్డు దాటుతూ వలందపేటకు చెందిన మొక్క శ్రీనివాసరెడ్డి(36) అనే పెయింటర్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ తెలిపిన వివరాల ప్రకారం ... శ్రీనివాసరెడ్డి ఎన్ఆర్ఐ ఆస్పత్రి వైపు వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా తగరపువలస నుంచి విశాఖ నిర్లక్ష్యంగా, వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కింద పడిపోయిన శ్రీనివాసరెడ్డి ఎడమచేయి, నడముకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆయన ఇంటికి ఫోన్ చేయగా వచ్చిన కుటుంబ సభ్యులు అనిల్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స అనంతరం సాయంత్రం 7.30కు డిశ్చార్జ్ చేశారు. దీంతో ఇంటికి వెళ్లిపోయిన శ్రీనివాసరెడ్డి ఆరోగ్యం గంటలోనే విషమించడంతో మళ్లీ అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాసరెడ్డి డోర్ పాలిషింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇతనికి భార్య లక్ష్మి, 9 ఏళ్ల కుమారుడు హేమ నిఖిల్, 6 ఏళ్ల కుమార్తె దీక్షిత ఉన్నారు. శ్రీనివాసరెడ్డి మృతితో వలందపేటలో విషాదం నెలకొంది.

మద్యం వ్యవహారంపై తూతూమంత్రంగా చర్యలు



ఆరిలోవ: ఇందిరా గాంధీ జూపార్కులో ఇటీవల జరిగిన మద్యం వ్యవహారంపై జూ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారు. వన్యప్రాణులు సంరక్షణలో ఉన్నవారు మద్యం మత్తులో జోగుతుంటే అధికారులు లైట్ తీసుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. బయటకు పంపించి మద్యం తీసుకురమ్మన్న యానిమల్ కీపర్‌ను వదిలేసి మద్యం తీసుకొచ్చిన ఎన్ఎంఆర్(తాత్కాలిక) ఉద్యోగిపై చర్యలు తీసుకుని చేతులు దులుపేసుకున్నారు. ఇటీవల జూలో ఏసీ–1 పరిధిలో ఉండే ఓ కీపర్ మధ్యాహ్నం సమయంలో ఒక ఎన్ఎంఆర్‌ను బయటకు పంపించి మద్యం తెప్పించుకున్నాడు. సాధారణంగా ఉదయం విధులకు వెళ్లిన సిబ్బంది మళ్లీ విధులు ముగిసిన అనంతరం సాయంత్రం మాత్రమే బయటకు రావాలి. మధ్యలో అత్యవసర సమయంలో అవసరమైన వారిని జూ అధికారుల అనుమతితో మాత్రమే బయటకు పంపిస్తారు. ఇక్కడ మాత్రం అలా కాకుండా కొందరు శాశ్వత యానిమల్ కీపర్లు చక్రం తిప్పుతున్నారు. వారికి అవసరమైనప్పుడు ఎన్ఎంఆర్‌లను బయటకు సొంత పనుల కోసం పంపిస్తున్నట్లు విశ్వసనీయ సమచారం. ఇందులో భాగంగానే ఇటీవల ఓ ఎన్ఎంఆర్ కీపర్ మధ్యాహ్నం సమయంలో శాశ్వత కీపర్ కోసం మద్యం తీసుకొస్తూ జూ ద్వారం వద్ద సెక్యూరిటీ, ఇతర సిబ్బందికి దొరికిపోయాడు. దీనిపై జూ అధికారులు ఆరా తీశారు. మద్యం ఎవరు తీసుకురమ్మన్నారో అధికారులకు తేటతెల్లమైంది. అయినా మద్యం బాటిల్ తీసుకొచ్చిన ఆ ఎన్ఎంఆర్‌ను మాత్రమే విధుల నుంచి తొలగించి, అసలు బాధ్యుడ్ని వదిలేయడంపై ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఇదంతా క్యూరేటర్‌కు తెలియకుండా కిందిస్థాయి అధికారులే చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల సుమారు ఆరు నెలలు పాటు సెలవులో ఉన్న క్యూరేటర్ నందనీ సలారియా వారం క్రితం మళ్లీ విధుల్లో చేరారు. ఈ మద్యం వ్యవహారంపై స్పందించిన క్యూరేటర్ జూలో కఠిన చర్యలు చేపడతామన్నారు. మద్యం లోపలకు ఎలా వచ్చిందో పూర్తిగా పరిశీలిస్తామన్నారు. ఇక నుంచి ఇలాంటివి జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు.

అమెరికన్ వర్సిటీలతో కలిసి ఏయూ ఎంఎస్ కోర్సులు

మద్దిలపాలెం: అమెరికన్ యూనివర్సిటీలతో కలిసి రెండు ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సహకార మాస్టర్ ప్రొగ్రాంలను ప్రారంభించినట్టు ఏయూ వీసీ ఆచార్య పీజీవీడీ ప్రసాదరెడ్డి తెలిపారు. స్క్రాంటన్ వర్సిటీలో రెండేళ్ల ఎంఎస్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సును ఏయూలో ఆన్‌లైన్‌లో ఏడాది, యూఎస్‌లో ద్వితీయ సంవత్సరం చదివే అవకాశం ఉంటుందన్నారు.

- ఎంఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌ను మిస్సోరి స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఏయూ సంయుక్తంగా అందిస్తుందని వీసీ తెలిపారు. ఇక్కడ విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీలో ఆన్‌లైన్‌లో మొదటి సంవత్సరం, యూఎస్ఏలో రెండో సంవత్సరం చదువుతారన్నారు. రెండూ స్టెమ్‌ల కోర్సుల వల్ల విద్యార్థులు ఎంఎస్ కోర్సులను పూర్తి చేసిన తర్వాత మూడేళ్లపాటు ఓపీటీకి అర్హులన్నారు. వారు యూఎస్ఏలో పని చేసుకోవచ్చని చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 94401 91968 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.